క్లుప్తంగా

కంపెనీకి నీటిని సరఫరా చేయొద్దు



మరికల్ : జూరాల నుంచి కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు వచ్చే నీటిని ఇథనాల్ కంపెనీకి తరలిస్తున్నారని, నీటి సరఫరాను నిలిపివేయాలని పాలమూరు అధ్యాయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకట్రాములు అన్నారు. కంపెనీకి ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్ష శుక్రవారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీ మూసివేయాలని రెండేండ్ల నుంచి ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఇక్కడి పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. ఓటుతోనే వీరికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ఇథనాల్ కంపెనీని మూసివేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు మరమ్మతు చేయండి సారూ!



మరికల్: మండలంలోని కన్మనూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. గతుకుల రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటుక బట్టీల కారణంగా అధిక సంఖ్యలో టిప్పర్లు తిరగడం వల్ల రోడ్డు మొత్తం ధ్వంసమైందని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్డు మరీ అధ్వానంగా మారుతున్నదని, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

కలుపును నివారించాలి



కోస్గి: పంటల్లో కలుపును నివారించాలని గుండుమాల్ క్లస్టర్ ఏఈవో చందన రైతులకు సూచించారు. గుండుమాల్ రైతువేదికలో శుక్రవారం కలుపు నివారణ మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కంది, పత్తి వంటి పంటలు సాగు చేసిన వెంటనే కలుపు నివారణ మందులను పిచికారీ చేయడం వల్ల కలుపుతీతకు కూలి డబ్బులు మిగులుతాయన్నారు. రైతులు సకాలంలో కలుపు నివారణ మందులు వాడడం వల్ల పెట్టుబడి ఆదా అవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా కలుపు నివారణ మందులు, పనిచేసే విధానాన్ని రైతులకు సమగ్రంగా వివరించారు.

రోగులకు పండ్ల పంపిణీ



మక్తల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గడ్డం కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు చట్ల వెంకటేశ్, నాయకులు హన్మంతు, నారాయణ, భీమేశ్, కర్నె వెంకటేశ్, కళ్యాణ్, బాలస్వామి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన రిలే దీక్ష

నారాయణపేట రూరల్: కోటకొండను మండలకేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహారదీక్ష శుక్రవారం 59వ రోజుకు చేరింది. గౌరీశంకరుల కళాకారుల బృందం ఆధ్వర్యంలో పలువురు నాయకులు దీక్షలో కూర్చోగా, మండల సాధన సమితి సభ్యులు పూలమాల వేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ కోటకొండను మండలం చేయాలని ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం తిరస్కరించడం సరికాదన్నారు. రాజకీయ లబ్ధి కోసమే కోటకొండపై వివక్ష చూపుతున్నారని వాపోయారు. విద్యారంగంలో అభివృద్ధి చెందాలంటే వెంటనే కోటకొండను మండలకేంద్రం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, రాము, దస్తప్ప, యాదగిరి, కాశీనాథ్, రాములు, చెన్నప్ప, సలీం పాల్గొన్నారు.



ఆక్రమణదారులపై ఉక్కుపాదం



పాతబస్టాండ్ వద్ద దుకాణాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

- రోడ్లపై ఏర్పాటు చేసిన దుకాణాల తొలగింపు
- నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని అధికారుల హెచ్చరిక

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో రోడ్ల ఆక్రమణదారులపై మున్సిపల్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, వ్యాపార కేంద్రాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సునీత, అధికారులు, సిబ్బంది ప్రధాన రహదారులను పరిశీలించారు. రోడ్లను ఆక్రమించి కొనసాగిస్తున్న చిరువ్యాపారుల బండ్లు, టిఫిన్, పాన్‌షాప్, జ్యూస్ సెంటర్లను తొలగించారు. దీంతో కొందరు వ్యాపారులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతమున్న మార్కెట్‌కే ప్రజలు వస్తున్నారని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయానికి ఎవరూ రావడంలేదని చిరువ్యాపారులు తెలిపారు. కాగా ఐదునెలల నుంచి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయంలో విక్రయాలు చేపట్టాలని వ్యాపారులకు సూచిస్తున్నా పట్టించుకోవడంలేదని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. రోడ్లపై విక్రయాలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. రోడ్లపై అమ్మకాలు చేపట్టకుండా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కొనసాగించాలని సూచించారు. మరోసారి రోడ్లపై విక్రయాలు చేపడితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అధికారులు, వ్యాపారుల మధ్య వాదోపవాదాల అనంతరం రైతుబజార్‌లో ఉన్న వ్యాపారులను తొలగింపజేశారు. పాతబస్టాండ్, మెయిన్ చౌరస్తాలో చిరు వ్యాపారాలను తొలగించారు.



రైతుబజార్‌ను ఖాళీ చేయించి గేట్‌కు తాళం వేసిన మున్సిపల్ అధికారులు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ధన్వాడ: చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జౌళీశాఖ ఏడీ బాబు సూచించారు. ధన్వాడలో శుక్రవారం చేనేత కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. బ్యాంకుల్లో కార్మికులు ప్రతినెలా రూ.వెయ్యి జమ చేస్తే ప్రభుత్వం రూ.2వేలు జమ చేస్తుందన్నారు. సహాయ కార్మికుడు రూ.600 కడితే ప్రభుత్వం రూ.1200 జమ చేస్తుందని, ఈ డబ్బులను 36నెలల తర్వాత కార్మికులు తీసుకోవచ్చని తెలిపారు. ప్రతి కార్మికుడికి చేనేత బీమా సౌకర్యం కల్పించినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న జౌళీశాఖ ఏడీ బాబు

ధన్వాడకు కొత్తగా క్లస్టర్ ఏర్పాటు చేయాలని, కార్మికులు తీర్మానం చేయగా ప్రభుత్వానికి పంపినట్లు ఏడీ తెలిపారు.

కొనసాగుతున్న ఇంటింటి ప్రచారం

కోస్గి: మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'హాత్ సే హాత్ జోడో' ఇంటింటి ప్రచారం శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు వీధుల్లో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆశయాన్ని కేసీఆర్ ప్రభుత్వం నీరుగార్చిందని, ప్రజలు మద్దతిస్తే రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు వార్ల విజయకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, భానునాయక్, ఇద్రీస్, నాయకులు నాగులపల్లి శ్రీనివాస్, నరేందర్, దేవేందర్, సురేశ్, వెంకట్రాములు, సలీం, ఆసీఫ్, ఫెరోజ్, ఇజాజ్, వెంకట్, గిరిప్రసాద్‌రెడ్డి, నర్సింహ, వెంకటయ్య, విద్యాసాగర్, ప్రతాప్, ప్రభోత్తం పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నరేంద్రమోదీని విమర్శిస్తే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య

మక్తల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీపై లేనిపోని విమర్శలు చేస్తే సహించమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. మక్తల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఊట్కూర్ మండల సర్వసభ్య సమావేశంలో బీజేపీ ఎంపీటీసీలపై ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. జింకల సమస్యలపై ప్రశ్నిస్తే పీఎం మోదీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. మక్తల్ నియోజకవర్గంలో మున్సిపాలిటీలకు చేసిందేమీలేదన్నారు. గద్వాల, నారాయణపేట జిల్లా కేంద్రాలకు వెళ్లే రోడ్లు నరకానికి దారులుగా మారాయన్నారు. కొన్ని గ్రామాలకు సాగునీరు అందడంలేదన్నారు. సమావేశంలో ఊట్కూర్ మాజీ సర్పంచ్ బాస్కర్, నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి, నర్సింహారెడ్డి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, అర్బన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్, శ్రీనివాసులు, రమేశ్, మంజునాథ్, నాగేశ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కోకన్వీనర్ ఆంజనేయులు

మాగనూర్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారం రెండోరోజుకు చేరింది. కార్మికుల సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, భరత్‌కుమార్, నాగేశ్, వెంకటప్ప, సురేశ్, భీంరాజ్,, హరీఫ్, మొగులప్ప, రఘు, మారెప్ప పాల్గొన్నారు.

నర్వ: పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ అన్నారు. నర్వ మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన సమ్మెకు సంఘీబావం తెలిపారు. కార్మికులు రాంచంద్రి, నర్సోజీ, ఆనందం, భాగ్య, నర్సింహులు పాల్గొన్నారు.

మద్దూరు: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకుడు కొండా నర్సింహులు హెచ్చరించారు. మద్దూరు, కొత్తపల్లి మండలాల పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండోరోజుకు చేరింది.


ధన్వాడ: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన సమ్మె కొనసాగింది. ఉదయభాను, బాలకృష్ణ, హుస్సేన్ పాల్గొన్నారు.

దామరగిద్ద: పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య డిమాండ్ చేశారు.

మక్తల్: పంచాయితీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మెలో పాల్గొని మాట్లాడారు. శ్రీనివాసులు, నర్సింహ, కిష్టప్ప, రాజు పాల్గొన్నారు.

కృష్ణ: మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగింది.

కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కరపత్రం విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణపేట: యూత్ జోడో.. బూత్ జోడో కార్యక్రమంతో కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాలని రాష్ట్ర యువజన నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం(సీవీఆర్ భవన్)లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నేషనల్ సెక్రెటరీ, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వివేక్, రాష్ట్ర కార్యర్శి, పేట జిల్లా ఇన్‌చార్జ్ రామ్‌సింగ్, రాష్ట్ర నాయకులు నర్సింహ, ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ అచారి మాట్లాడారు. డోర్ టూ డోర్ క్యాంపెయిన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసాలను, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేసే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనా రెడ్డి చేపట్టిన యువ పోరాట యాత్ర త్వరలోనే జిల్లాలోకి రాబోతుందని, ఆ యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

కణతి తొలగింపు

నారాయణపేట: జిల్లా ఆస్పత్రిలో చిన్నచిన్న ఆపరేషన్లు చేయడం సాధారణం. శుక్రవారం ఓ మహిళ కడుపులో ఆపరేషన్ చేసి సుమారు 8కిలోల అండాశయ కణతిని విజయవంతంగా తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట మండలం పేరపళ్లకు చెందిన లక్ష్మి (45) అనారోగ్యంతో జిల్లా ఆసుపత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు.. స్కానింగ్ చేసి కడుపులో అండాశయ కణతి ఉందని గుర్తించారు. ఆపరేషన్ చేసి కణతిని తొలగించారు. ఆపరేషన్ చేసిన వారిలో వైద్యులు రంజిత్, సౌజన్య, దీపిక, నర్సులు విజయలక్ష్మి, సుజాత తదితరులు ఉన్నారు.

ఆంగ్లభాషపై ప్రత్యేక తరగతులు

నారాయణపేట రూరల్: విల్ టు కెన్ సంస్థ సౌజన్యంతో జిల్లాలోని ఉపాధ్యాయులకు ఆంగ్ల భాషపై ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభమైన నేపథ్యంలో ఉపాధ్యాయులందరూ సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకుగానూ ఈనెల 10నుంచి 40 రోజులపాటు సాయంత్రం గంటపాటు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌జీటీ, ఎస్‌ఏ, పండిత్, పీఈటీలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల నిరసన

నారాయణపేట రూరల్: విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడపకపోవడంపై శుక్రవారం విద్యార్థులు పేట డిపో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఊట్కూర్ మండలం అమీన్‌పూర్‌కు రోజూ ఉదయం 9గంటల తర్వాత బస్సు రావడం వల్ల 10గంటల తర్వాత నారాయణపేటకు చేరుకుంటున్నామని తెలిపారు. విషయాన్ని ఆర్టీసీ సూపర్‌వైజర్లు, సీఆర్‌సీతోపాటు డీఎం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని వాపోయారు. విద్యాసంస్థల సమయానికి బస్సు నడిపించాలని కోరారు.

9న రక్తదాన శిబిరం

మక్తల్: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 9న మక్తల్ పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ సురేశ్, నగర కార్యదర్శి వంశీ మహేశ్ తెలిపారు. ఏబీవీపీ 75 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శిబిరంలో యువత స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాగనూర్: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం ఆర్ఐ శ్రీశైలం పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. మాగనూర్ మండలం మందిపల్లికి చెందిన సదాశివ గ్రామంలోని పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా, ఆర్ఐ పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కనీస వేతనం ఇవ్వాలి

నారాయణపేట టౌన్: మధ్యాహ్నభోజనం పథకం కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. మధ్యాహ్నభోజన పథకం కార్మికులకు రూ.26వేల వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయించి శ్రమను దోచుకుంటున్నాయని ఆరోపించారు. 30–40ఏండ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోవడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ అధికారి నారాయణకు వినతిపత్రం అందజేశారు.

న్యాయం చేయాలి

మద్దూరు: తమకు న్యాయం చేసే వరకు రిలే దీక్ష కొనసాగిస్తామని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు స్పష్టం చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో రోజాపై చర్యలు తీసుకోవాలని, తొలగించిన అంగన్‌వాడీలను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మద్దూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్ష శుక్రవారం 4వ రోజుకు చేరింది. వీరి దీక్షకు సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు ఆయాలపై సీడీపీవో వేధింపులకు గురిచేస్తున్నదని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో సగానికిపైగా అంగన్‌వాడీలకు ఇప్పటికే మెమోలు జారీ చేయడం, నలుగురు టీచర్లను విధుల నుంచి తొలగించడం హేయమైన చర్య అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే జిల్లావ్యాప్తంగా సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది శశికళ, పుష్ప, శ్రీలత, భాగ్యమ్మ, వీరమణి, నాగమ్మ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పేదల అభ్యున్నతే లక్ష్యం



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కృష్ణ: పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముడుమాల్‌లో శుక్రవారం 100మంది బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి కార్యకర్తకు అన్నివిధాలా అండగా ఉంటామని, అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని పటిష్ట చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, అశోక్‌గౌడ్, వెంకటప్ప, వెంకటేశ్, రాఘవేంద్ర, శివరాజ్ పాటిల్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఊట్కూర్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి కోరారు. స్థానిక చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నారాయణపేట–మక్తల్ రోడ్డుకు ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర మొక్కలను నాటి ట్రీగార్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాళప్ప, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, కార్యదర్శి సుమలత, ఈసీ చంద్రకంటి శ్రీనివాస్, టీఏలు చింత లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, నాయకుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఊట్కూర్‌లో మొక్క నాటుతున్న ఎంపీపీ లక్ష్మి

మత్స్య సహకార సంఘం చైర్మన్‌ను కలిసిన నాయకులు



మత్స్యశాఖ చైర్మన్ రవీందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మక్తల్: రాష్ట్ర మత్స్య సహకార సంఘం చైర్మన్ పిట్టల రవీందర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని మత్స్య సహకార సంఘం భవనంలో ఆ సంఘం జిల్లా నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం పలు సమస్యలతోకూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొళ్ల వెంకటేశ్, నాయకులు కావలి శ్రీహరి, చంద్రశేఖర్, అంజయ్య, ఆంజనేయులు, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న మహిళలు



శివాజీ చౌరస్తాలో శివసత్తుల విన్యాసాలు

కోస్గి: పట్టణంలో శుక్రవారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలతో మహిళలు ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెల్పుతున్న సలీం

మద్దూరు: ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహ్మద్ సలీం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు బాల్‌సింగ్‌నాయక్, ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి, కోస్గి మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్, గోవిందు, వెంకటయ్య, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పబ్లిక్ నోటీస్

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయు నోటీసు ఏమనగా, నా క్లయింటు అయిన బాలప్ప తండ్రి సంబెన్న వయస్సు: 50 సం॥, వృత్తి: వ్యవసాయం, నివాసం: ఎలిగండ్ల గ్రామం మరికల్ మండలం, నారాయణపేట జిల్లా. తెలిపిన వివరాల ప్రకారం తనకు మరియు అదే గ్రామానికి చెందిన కీ॥శే॥ ఎన్మనోళ్ల లక్ష్మయ్య తో సర్వే నెం. 179/ఋ/3 లో విస్తీర్ణం ఎ 0-16 గుంటలు గతములోనే కొనుగోలు చేసుకుని కబ్జాలో వున్నాడు, కాని సదరు కీ॥శే॥ ఎన్మనోళ్ల లక్ష్మయ్య భార్య, పిల్లలు అయినటు వంటి ఎన్మనోళ్ల మనెమ్మ, ఎన్మనోళ్ల రామాంజనేయులు, ఎన్మనోళ్ల అంజి మరియు ఎన్మనోళ్ల అనిల్ అను వ్యక్తులు సదరు భూమిని ఎన్మనోళ్ల లక్ష్మయ్య మరణం తరువాత నా క్లయింటుకు తెలియకుండా అక్రమంగా తమ పేరుపైకి రికార్డు మార్పించుకోవడమే కాకుండా, ఇతరులకు అమ్మజూపుతున్నట్లు మా దృష్టికి వచ్చినది కావున ఇట్టి మోసపూరిత మాటలు నమ్మి ఎవ్వరూ కూడా ఇట్టి భూమిని కొనుగోలు చేయవద్దని తెలుపడమైనది. ఒకవేళ అమ్మినచో లేదా కొనుగోలు చేసినచో వారిపైన తగు సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించడమైనది.

సం/- కె. లక్ష్మీపతిగౌడ్, కె. కృష్ణగౌడ్, మహబూబ్ అలీ అడ్వకేట్స్, నారాయణపేట సెల్: 9000861613.